

## నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాక

అనకాపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు పెందుర్తి నియోజకవర్గం వేపగుంటలో పలు కార్యక్రమాలకు హాజరవుతారు. అనంతరం సబ్బవరం మండలం ఇరువాడలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం మూడు గంటలకు అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగే డీఆర్‌సీ సమావేశానికి హాజరవుతారు. మీడియాతో మాట్లాడిన అనంతరం విశాఖ బయలుదేరి వెళతారు.

# తవ్వుకో.. అమ్ముకో!

**ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో గ్రావెల్ దందా**

- రాత్రి వేళల్లో యంత్రాలతో తవ్వకాలు
- టిప్పర్ లారీలు, ట్రాక్టర్లతో రవాణా
- చుట్టుపక్కల ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లు, కొత్త నిర్మాణాలకు తరలింపు
- టీడీపీకి చెందిన ఒక ముఖ్య నేతపై ఆరోపణలు
- పట్టించుకోని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు



డీఎల్‌పురం సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

నక్కపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): **విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో అక్రమార్కులు గ్రావెల్ తవ్వుకుపోతున్నారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరిపి టిప్పర్లు, లారీల్లో రవాణా చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, కొత్తగా నిర్మిస్తున్న హేచరీలు, ఇతర కట్టడాల్లో పునాదులు నింపడానికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.**

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డీఎల్‌పురం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఎనిమిదేళ్ల కిందట ఏపీఐఐసీ సుమారు 4,500 ఎకరాలను సేకరించారు. ఇంతకాలం ఖాళీగా వున్న ఈ భూముల్లో త్వరలో ప్రైవేటు స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కానున్నాయి. మరికొద్ది రోజుల్లో వీటి నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం వుంది. దీంతో కారిడార్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అక్రమార్కులు తెగబడుతున్నారు. డీఎల్ పురం, వేంపాడు రెవెన్యూ పరిధి అమలాపురం-మూలపర్ర మధ్య వున్న ఏపీఐఐసీ భూముల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వి టిప్పర్‌లారీలు, ట్రాక్టర్లలో తరలించి వ్యాపారం సాగిస్తున్నారు. నక్కపల్లి మండలం బంగారమ్మపేట సమీపంలో నిర్మిస్తున్న భారీ హేచరీకి గ్రావెల్ తరలిస్తున్నట్టు తెలిసింది. ఇంకా పాయకరావుపేట, తుని ప్రాంతాల్లో వున్న హేచరీలకు కూడా గ్రావెల్‌ను తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ట్రిప్పర్ గ్రావెల్ రూ5 వేలు, ట్రాక్టర్ గ్రావెల్ రూ.800 నుంచి రూ.1,000కి విక్రయిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక కీలక నేత గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే సంబంధిత అధికారులు పట్టించుకోడంలేదని తెలిసింది.



మూలపర్ర వద్ద గ్రావెల్ తవ్విన ప్రదేశం

### తనిఖీ చేసి చర్యలు చేపడతాం

ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వినా, తరలించినా ఉపేక్షించేది లేదు. ఆయా గ్రామాల్లో గ్రావెల్ తవ్విన భూములను పరిశీలిస్తారు. గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, గ్రావెల్ తవ్వకాలు జరిసేన యంత్రాలు, రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తాం.

ఎస్.నరసింహారావు,
ఏపీఐఐసీ జోనల్ మేనేజర్





దర్శనం కోసం క్యూలైన్‌లలో ఉన్న భక్తులు

## నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర గత వారం ముగిసినప్పటికీ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో క్యూలైన్లతోపాటు రోడ్డుపై ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోయాయి. (అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి)

# ముసురు వాతావరణం

**పలుచోట్ల భారీ వర్షం, కొన్నిప్రాంతాల్లో చిరుజల్లులు**

- నక్కపల్లిలో అత్యధికంగా 54.2 మి.మీ.ల వర్షం
- రోజంతా చల్లగానే వాతావరణం



పాయకరావుపేటలో ఉదయం 11 గంటల సమయంలో మేఘాలు దట్టంగా కమ్ముకుని భారీగా కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ముసురు వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆకాశం మేఘావృతమై వుంది. ఉదయం పది గంటల ప్రాంతంలో జల్లులతో వర్షం మొదలైంది. అనంతరం పలు మండలాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురవగా, పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో పట్టపగలు చీకట్లు కమ్ముకున్నాయి. గాలులు అధికంగా వీచిన ప్రాంతాల్లో కొంతసేపు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఎండలు మండిపోయే తరుణంలో ఇందుకు భిన్నంగా వర్షాలు కురుస్తూ, వాతావరణం చల్లగా వుండడంతో ప్రజలు ఊటర చెందుతున్నారు. జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ మండలాల్లో కురిసిన వర్షం పాతం వివరాలు.. నక్కపల్లిలో 54.2 మిల్లీమీటర్లు, కోటవురట్లలో 38.6, పాయకరావుపేటలో 35.8, ఎలమంచిలిలో 34.4, కశింకోటలో 32, మునగపాకలో 26.2, చీడికాడలో 23.8, మాడుగులలో 23.6, నాతవరంలో 23.4, మాకవరపాలెంలో 18.4, బుచ్చెయ్యపేటలో 19.2, రోలుగుంటలో 10.2, ఎస్.రాయవరంలో 9.6, రావికమతంలో 9.4, అచ్యుతాపురంలో 8.2, దేవరాపల్లిలో 6.8, అనకాపల్లిలో 6.2, చోడవరంలో 5.4, గొలుగొండలో 4, కె.కోటపాడులో 4, నర్సీపట్నంలో 3.6, రాంబిల్లిలో 3.4, సబ్బవరంలో 1.8, పరవాడలో 1.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది.

### వేసవి దుక్కులకు అనుకూలం

అనకాపల్లి అగ్రికల్చర్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వారం రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాల వల్ల రబీ పంటలకు, తోటలకు మేలు జరుగుతుందని వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్యం శాస్త్ర విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. ఈ వర్షాలను వినియోగించుకొని వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయన సూచించారు. 45 రోజుల కార్సి చెరకు తోటలకు ఎకరాకు 150 కిలోల యూరియా, 90 రోజుల క్రితం నాటిన మొక్క తోటలకు 75 కిలోల యూరియాను పైపాటుగా వేయాలన్నారు. ఖాళీగా వున్న భూముల్లో తడి ఆరి, పదునుగా ఉన్నప్పుడు లోతుగా దుక్కి దున్నుకోవాలన్నారు. దీనివల్ల పంటలకు నష్టం కలిగించే పురుగులు, తెగుళ్ల అవశేషాలు, కలుపు విత్తనాలు ఉపరితలంపైకి చేరి ఎండల తీవ్రతకు నశిస్తాయని తెలిపారు.

# అధ్వానంగా ఆట స్థలాలు

**అనకాపల్లి, ఎలమంచిలిలో నిర్వహణ కొరవడిన స్టేడియంలు**

- అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు ఇక్కట్లు

**వర్షం పడితే ఎలమంచిలి రాజీవ్ క్రీడామైదానం చెరువే!**

- ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యం
- కొద్దిపాటి వర్షం పడినా.. మైదానంలో ఆడుకోలేని పరిస్థితి
- క్రీడా సాధనకు ఆటంకంతో ఇబ్బందులు



వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తున్న ఎలమంచిలిలో రాజీవ్ గాంధీ క్రీడామైదానం



ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడంలేదు. సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో కొద్దిపాటి వర్షం కుసిరినా నీరు నిలిచిపోయి చెరువులా మారుతున్నది. దీంతో వారం, పది రోజులపాటు ఆటలు ఆడుకునేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడుతున్నది. వర్షాకాలంలో అయితే ఈ మైదానాన్ని క్రీడాకారులు వినియోగించుకోలేకపోతున్నారు. ఇక్కడ హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, బాస్కెట్ బాల్ తదితర విభాగాల్లో నిత్యం క్రీడాకారులు సాధన చేస్తుంటారు. ఇంకా పలువురు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వస్తుంటారు. వందలాది మంది హాకీ క్రీడాకారులు, ఇతర ఆటలకు సంబంధించి ఎంతమంది రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో సాధన చేసి, తర్ఫీదు పొంది రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగారు. ఎంతో ఉపయుక్తమైన క్రీడా మైదానం నిర్వహణ, అభివృద్ధిపై పాలకులు శీతకన్ను వేశారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన నేతలు, క్రీడా మైదానం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడమే తప్ప ఆచరణలో అమలు చేయలేదు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడకు వచ్చి ఆయా క్రీడల్లో సాధన చేస్తుంటారు. అయితే గత రెండు రోజులు కురిసిన వర్షాలతో మైదానం మొత్తం నీరు చేరి చెరువులా తయారై ఆటలు ఆడుకునేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడింది. మైదానం పరిస్థితి చూసి క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి, రాజీవ్ గాంధీ క్రీడా మైదానం అభివృద్ధికి కృషి చేయాలని క్రీడాకారులు, వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

### బురదమయం... ఎన్టీఆర్ క్రీడా మైదానం

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం అధ్వానంగా మారింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో గ్యాలరీల వద్ద, స్టేడియం మధ్యలో నీరు నిలిచిపోయి బురదమయమైంది. దీనికితోడు నూకాంబిక అమ్మవారి పండుగలో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల సామగ్రిని పూర్తిగా తొలగించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వాకర్స్ క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. స్టేడియంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళ్లలో వాకర్స్, వివిధ రకాల ఆటలు ఆడుకునే క్రీడాకారులు వస్తుంటారు. అయితే నెల రోజుల పాటు ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదికలు, స్టాల్స్ ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు ఒకింత అసౌకర్యానికి గురయ్యారు. ఉత్సవాలు ముగిసి వారం రోజులు అయినప్పటికీ స్టేడియంలో సామగ్రి పూర్తిగా తీయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని క్రీడాకారులు, వాకర్స్ వాపోతున్నారు. దీనికితోడు స్టేడియంలో కురిసిన వర్షం నీరు సత్వరమే బయటకు వెళ్లకపోవడంతో బురదమయం అవుతున్నది. జీవీఎంసీ అధికారులు స్పందించి స్టేడియంను మెరుగుపరచాలని క్రీడాకారులు కోరుతున్నారు.



ఒకవైపు బురద, మరోవైపు సామాగ్రితో అధ్వానంగా వున్న అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం

# వైసీపీ సేవలో అధికారులు

**ప్రభుత్వ కార్యాలయాలపై ఇంకా తొలగించని జగన్ బొమ్మలు, నవరత్నాల లోగోలు**

- కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- అమలుకాని ప్రభుత్వ ఆదేశాలు



కొమరవోలులో పేరు మార్చని రైతు భరోసా కేంద్రం. భవనంపై తొలగించని మాజీ సీఎం జగన్ చిత్రం, నవరత్నాల లోగో

రోలుగుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మరో నెల రోజుల్లో ఏడాది పూర్తవు తుంది. అయినప్పటికీ పలువురు అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఇప్పటికీ గత సీఎం చిత్రాలు, అప్పటి ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు కొనసాగుతూనే వున్నాయి. ఇందుకు రోలుగుంట మండలం కొమరవోలులోని రైతు సేవా కేంద్రం ఒక ఉదాహరణ. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి, వాటిపై నాటి సీఎం జగన్ ఫొటోతోపాటు నవరత్నాల పేరుతో ఆయా పథకాల పేర్లు రాశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటోలు, భవనాలపై ఉన్న పేర్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. కానీ కొమరవోలు రైతు భరోసా కేంద్ర పేరు మార్చలేదు. జగన్ బొమ్మతో కూడిన నవరత్నాల లోగోను తొలగించలేదు. కుసర్లపూడిలో గ్రామ సచివాలయం మీద కూడా వైసీపీ నవరత్నాల లోగో ఇప్పటికీ దర్శనమిస్తున్నది.

# నీట్‌కు 97.75% హాజరు

**కేంద్రాలకు ముందుగానే చేరుకున్న అభ్యర్థులు**

- క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిబ్బంది



తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయం వద్ద బారులుతీరిన అభ్యర్థులు

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తత్సమాన) ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నీట్‌కు విశాఖలోని వివిధ కేంద్రాల్లో 97.75 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. 16 కేంద్రాల్లో 7,344 మందికిగాను 7,179 మంది పరీక్ష రాశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించలేదు. దీంతో ఉదయం 11 గంటల నుంచే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు రావడం మొదలైంది. కేంద్రాల వద్ద నియమించిన సిబ్బంది.. మెయిన్ గేట్ల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. బాలికలకు చెవి పోగులు, ముక్కుపుడకలు తొలగించిన తరువాతే లోపలికి అనుమతించారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో డ్రైనేజీ కాలువలో నిలిచిపోయిన మురుగు

# డ్రైనేజీలు అస్తవ్యస్తం

**వర్షం కురిస్తే పొంగుతున్న కాలువలు**

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- కాలువల అభివృద్ధికి చర్యలు శూన్యం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- దుర్వాసన, దోమల బెడదతో ప్రజల ఇక్కట్లు

నర్సీపట్నం, మే 4: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా.. డ్రైనేజీ కాలువలు పొంగిపోయి మురుగు నీరు రోడ్లపై పారుతున్నది. మునిసిపాలిటీ ఏర్పడి 14 ఏళ్లు కావస్తున్నప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి నోచుకోలేదు. మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమల బెడద అధికమైంది. మెయిన్ రోడ్డు మొదలుకొని చిన్నపాటి వీధుల వరకు డ్రైనేజీ కాలువల నిర్వహణ అధ్వానంగా వుంది. మెయిన్ రోడ్డుకి ఇరువులా ఉన్న డ్రైనేజీ కాలువలు 40 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. పక్కా కాలువలు కాస్తా కచ్చా కాలువలుగా మరిపోయాయి. గత ప్రభుత్వంలో అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుము వరకు మెయిన్ రోడ్డు విస్తరణతో ... మిగతా 6వ పేజీలో

## నేటి నుంచి ఎలమంచిలిలో సీపీఐ జిల్లా 2వ మహాసభలు

ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనకాపల్లి జిల్లా 2వ మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 3 రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు పట్టణంలోని గుర్రవప్ప కల్యాణ మండపం నుంచి ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం బహిరంగసభ ప్రారంభం అవుతుందన్నారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పిచ్చికుక్క దాడిలో 8 మందికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఆదివారం ఉదయం పిచ్చికుక్క దాడి చేసిన సంఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు సీహెచ్‌సీకి తరలించగా ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. గాంధీనగర్‌లో ఎ.రామకృష్ణ, టి.లోకనాథం, వి. గణపతి, బంగారుతల్లి, ఎస్‌కే.అయేష, అప్పారావు మరి కొంతమందిపై పిచ్చి కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో గాయపడిన వారికి చికిత్స చేసినట్టు సీహెచ్‌సీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

## ముగిసిన శ్రీరామ రక్ష రథయాత్ర



ఎలమంచిలిలో శ్రీరామ రక్ష రథయాత్రను దర్శించుకుంటున్న భక్తులు

ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో నియోజకవర్గంలో 21 రోజులుపాటు నిర్వహించిన శ్రీరామ రక్ష రథయాత్ర ఆదివారం ఎలమంచిలిలో ముగిసింది. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర ద్వారా శ్రీరాముడుని లక్షలాది మంది భక్తులు చూసి తరించారు. 21 రోజులు అనంతరం మునిసిపాలిటీ కొత్తపాలెంలో శనివారం రాత్రి భారీ జనసమూహం నడుమ హారతి, ఊంజల సేవ కార్యక్రమంతో రథయాత్రను ముగించారు. అనంతరం ఆదివారం ఉదయాన్నే మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, గోపూజా చేసి రథాన్ని ఎలమంచిలి పట్టణానికి తరలించి ఉత్సవ విగ్రహాలను బాలరాముని విగ్రహం చినరామస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

## వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థుల ఆసక్తి

పాయకరావుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోంది. ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవగా రిసోర్స్‌పర్సన్స్ ఎస్.సీతారామమూర్తి, రాజు తదితరులు పుస్తక పఠనం, కథలు చెప్పడం, డైరీ రాయడం, హిందీ, ఇంగ్లీషు గ్రామర్ చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులకు యోగాతోపాటు వివిధ క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

డ్రైనేజీ సమస్య తొలగుతుందని ప్రజలు భావించారు. అయితే స్థలాలు, భవనాలు కోల్పోతున్న వారిలో కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి. దీంతో కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది డ్రైనేజీ పరిస్థితి. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుము వరకు 3,000 వేల మీటర్ల మేర డ్రైనేజీ కాలువలు నిర్మించాల్సి వుండగా, కేవలం 250 మీటర్లు మాత్రమే పూర్తి నిర్మించారు. అసంపూర్తి పనుల కారణంగా కాలువల్లో మురుగు నీరు పారడం లేదు. రోడ్డుకు ఇరువైపులా వున్న వ్యాపారులు, నివాసితులు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. చింతపల్లి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు, నర్సీపట్నం- కృష్ణాదేవి పేట రోడ్డులో కాలువలు పూర్తిగా పూడుకు పోయాయి.

### వార్డుల్లో పరిస్థితి మరీ అధ్వానం..

మునిసిపాలిటీలోని ఇతర ప్రాంతాల్లో సైతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు.. వీధి కాలువల్లో నుంచి మురుగు నీరు మెయిన్ డ్రైనేజీలోకి పంపే మార్గం లేదు. సీసీ రోడ్లు నిర్మిస్తున్న అధికారులు.. డ్రైనేజీ కాలువల గురించి పట్టించుకోవడం లేదు. లోతట్టు ప్రాంతాలైన వెంకునాయుడుపేట, బొంతువీధిలో డ్రైనేజీ నీరు పోయే మార్గం లేక చిన్నపాటి వర్షానికి మురుగునీరు రోడ్లపై పారుతున్నది. ప్రశాంతి నగర్, బ్యాంక్ కాలనీ, శారదా నగర్, బొంతువీధి, శివపురం తదితర ప్రాంతాల్లో కాలువలు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సైడ్ వాల్స్ లేని కాలువ

# పెదబోదిగల్లం హైస్కూల్‌పై పెద్దల నిర్లక్ష్యం

- శిథిలావస్థకు చేరిన తరగతి గదుల భవనం
- దెబ్బతిన్న వరండా
- వర్షం వస్తే ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- తాత్కాలిక ఏర్పాట్లు చేయకుంటే పిల్లలను పంపమని తల్లిదండ్రుల హెచ్చరిక



హైస్కూల్ భవనం సన్‌షేడ్ ఊడి, ఇనుప ఊచలు బయటకు కనబడుతున్న దృశ్యం

నక్కపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్ భవనాల పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుంది. గత మూడేళ్ల నుంచి ఈ స్కూల్ భవనం శిథిలావస్థకు చేరుకున్నా విద్యాశాఖాధికారులు కనీసం స్పందించలేదు. జిల్లా స్థాయి అధికారులు పలుమార్లు వచ్చి చూసి వెళ్లడమే తప్ప, ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు కనిపించలేదు.

పెదబోదిగల్లంలో జడ్పీ హైస్కూల్‌లో 7 తరగతి గదుల సముదాయాన్ని 25 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇక్కడ పెదబోదిగల్లం, చినబోదిగల్లం, సీతంపాలెం, పెదదొడ్డిగల్లు, అప్పలపాయకరావుపేట, రామకృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన బాల,బాలికలు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుకుంటున్నారు. గత కొన్నేళ్ల నుంచి తరగతి గదులకు మరమ్మతులు చేయకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 81 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడు తరగతి గదులుండగా.. వాటిలో 5 తరగతి గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత రెండేళ్ల నుంచే వర్షం వచ్చేటప్పుడు తరగతి గదుల్లో శ్లాబ్ పెచ్చులూడి పోయేవి. అదృష్టవశాత్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. తరగతులు నిర్వహిస్తున్న సమయంలో శ్లాబ్ పెచ్చులు పడితే ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వరండా కూడా పూర్తిగా దెబ్బతింది. శ్లాబ్ సన్‌షేడ్ పెచ్చులు ఊడిపడిపోవడంతో ఇనుప ఊచలు బయటకు కనబడుతున్నాయి. 2025-26 విద్యాసంవత్సరం పునఃప్రారంభమయ్యేలోగా శిథిలావస్థకు చేరిన తరగతి గదులను తొలగించి, ఆ స్థానంలో తాత్కాలిక గదులైనా నిర్మించకపోతే ఈ హైస్కూల్‌లో పాఠాలు చెప్పే అవకాశాలు తక్కువ. కనీసం పిల్లలు కూర్చోవడానికి కూడా అవకాశం లేని దుస్థితి. తమ గ్రామంలో వున్న హైస్కూల్‌లో విద్యాశాఖాధికారులు చిన్నచూపు చూస్తున్నారని, వేసవి సెలవులు అనంతరం పాఠశాలను ప్రారంభించేలోగా కొత్త భవనాలు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. లేకపోతే తమ పిల్లలను చదువు మాన్పించేస్తామని చెబుతున్నారు.



తరగతి గదుల్లో పడుతున్న శ్లాబ్ పెచ్చులు

### తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి

విద్యాసంవత్సరం పునఃప్రారంభమయ్యేలోగా తాత్కాలిక తరగతి గదులైనా నిర్మించకపోతే విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుంది. ఎందుకంటే ఈ స్కూల్ భవనం బాగోలేనందున వేరొక పాఠశాలకు ఈ పిల్లలను పంపే అవకాశాల్లేవు. దీనిని కారణం గ్రామానికి ఆనుకుని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు కింద మూడేళ్ల కిందట రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించారు. భారీ వర్షాలు కురిస్తే ఈ వంతెన కింద నెలలు తరబడి 3 నుంచి 4 అడుగుల లోతున నీరు నిలిచిపోతుంది. అందుచేత ఈ గ్రామం దాటి వెళ్లి వేరే చోట చదువుకునే అవకాశం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, తక్షణమే పెదబోదిగల్లం హైస్కూల్‌కు తరగతి గదులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో డీఈవో స్థాయి అధికారులు వచ్చి చూసినా ఇప్పటి వరకూ ఇసుమంత పని కూడా జరగకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారిందనే చెప్పాలి.

### వర్షం వస్తే పెచ్చులూడిపోతున్నాయి

**చోడిశెట్టి సత్యనారాయణ, హెచ్‌ఎం**



గత రెండేళ్ల నుంచి వర్షం పడితే శ్లాబ్ పెచ్చులూడి పోతున్నాయి. తమ స్కూల్ భవనం పరిస్థితి చాలా భయానకంగా వుంది. వర్షం పడితే మరుసటి రోజు శ్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. ఈ విషయాన్ని మా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పిల్లలకు ఇబ్బంది లేకుండా మా ఉన్నతాధికారులు చర్యలు చేపడతారని భావిస్తున్నాం.

# ‘పేట’లో ఉదయం వర్షం.. మధ్యాహ్నం ఎండ

పాయకరావుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆదివారం పాయకరావుపేటలో ఉదయం భారీ వర్షం, మధ్యాహ్నం ఎండ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ విపరీతంగా కాసింది. ప్రస్తుత ఎండాకాలంలో ఏప్రిల్ నెల మొదటి వారం నుంచే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతలకు ఇబ్బంది పడుతున్న తరుణంలో గత కొద్ది రోజులుగా అడపా దడపా వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆదివారం ఉదయం 10.30 నుంచి భారీ వర్షం పడింది. దీంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఇక మధ్యాహ్నం రెండు గంటల నుంచి మేఘాలు విడిపోయి ఎండ రావడంతో సాయంత్రం వరకు వేడి వాతావరణం నెలకొంది.



పాయకరావుపేటలో వర్షం కురిసిన తర్వాత ఎండ కాస్తున్న దృశ్యం

# అంధకారంలో ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు

- చీకటి పడితే భయం..భయంగా రాకపోకలు
- ప్రారంభానికి ఎదురుచూస్తున్న నూతన విద్యుత్ లైట్లు

ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. రైల్వే స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు భయం.. భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగక పోవడంతో స్థానికులు సైతం రాకపోకలు సాగించాలంటే భీతిల్లుతున్నారు.

ఎలమంచిలి రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకూ ఏర్పాటు చేసిన కొన్ని విద్యుత్ లైట్లు గత నాలుగు రోజులుగా వెలగడం లేదు. రైల్వే స్టేషన్ సమీపంలో కొన్ని లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. విద్యుత్ లైట్ల నిర్వహణ పట్ల మునిసిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈ దుస్థితి నెలకొంది. ఎలమంచిలి రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి 7 గంటల సమయంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ దిగి రైల్వే స్టేషన్ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు మహిళలు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. అసలే ఇటీవల పట్టపగలే పట్టణంలో దొంగతనాలు జరుగుతుండడంతో మహిళలు రోడ్డుపై అడుగు పెట్టాలంటే ఆందోళన చెందుతున్నారు. మునిసిపల్ సిబ్బంది విద్యుత్ లైట్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రైల్వే స్టేషన్ రోడ్డు ఆధునికీకరణలో భాగం ఇటీవల లక్షలాది రూపాయలతో కొత్తగా మరిన్ని హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ లైట్లను ఇంకా ప్రారంభించలేదు. ప్రయాణికులు, పట్టణ ప్రజల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ రోడ్డులో విద్యుత్ లైట్లు అన్నీ వెలుగులు విరజిమ్మేలా మునిసిపల్ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డులో చీకటిగా ఉన్న దృశ్యం

# క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు అధికం

- శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ చైర్మన్ నగేశ్

అచ్యుతాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నునపర్తి శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ చైర్మన్ ఆర్‌వీవీ నగేశ్ అన్నారు. ఆదివారం నునపర్తిలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ 45 రోజులపాటు జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణనిచ్చి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతోనే ఈశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో రాణించడంతోపాటు ఇటీవల టెన్త్, ఇంటర్‌ల్లో మంచి మార్కులు సాధించిన పి. ప్రజ్ఞ సుహాసిని, కె. జీవన్ పార్థివ్, వి. ప్రశాంత్, వై. భరద్వాజ్, వి. జ్యోత్స్న, పి శశివర్ధన్, ఎం. శ్యామల, వి. వినీల్, ఆర్. జస్వంత్. జి. నిహారికలకు మెడల్స్ వేసి మెమోంటోలను నగేశ్ అందజేశారు. అనంతరం బ్యాట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహ నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదపూడి శంకరరావు, క్లబ్ ప్రధాన కార్యదర్శి మాసరవరపు అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కన్నూరు నరసింగరావు, దెడ్డి దేముడు, డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నగేశ్

# వర్షాకాలంలోగా వంతెన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశం

మునగపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలోగా వంతెన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కాంట్రాక్టర్‌కు సూచించారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా ఆదివారం మునగపాకలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా విస్తరణకు చొరవ తీసుకుంటున్నామన్నారు. కాంక్రీట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం, మొల్లేటి ఆనంద్, ఆడారి గణేష్ తదితరులు ఉన్నారు.

### మూగజీవులకు వైద్య సేవలందించాలి

మూగజీవులకు వైద్యం అందించడంలో వైద్యాధికారులు అంకితభావం చూపాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం పశువైద్యాధికారులతో ఆయన సమావేశమయ్యారు. వైద్య సేవలు, మందులు, మౌలిక వసతులు గురించి ఆరా తీశారు. స్థానిక మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ అందిస్తున్న వైద్య సేవలు, దాణా, సిబ్బంది కొరత తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సమావేశంలో వైద్యులు పద్మజ, సుమతిరాణి, జగదీష్, శివ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే విజయకుమార్

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాంబిల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి జడ్పీ హెచ్ స్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. 1974-75 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా ఒకచోట కలిశారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిమిలి హైస్కూల్లో చదువుకున్నటువంటి పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## 7న హరిపురంలో జనవాణి

రాంబిల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈనెల 7న జనవాణి కార్యక్రమం జరగనుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే విజయకుమార్, అధికారులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు జనవాణి కార్యక్రమం జరగనుందన్నారు.

## కోటవురట్ల పోలీసుల బదిలీ

కోటవురట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో సాధారణ బదిలీలు చేశారు. ఒకే పోలీసు స్టేషన్‌లో ఐదేళ్ల పైగా పనిచేసిన వారికి బదిలీ చేశారు. కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో ఆరుగురు పోలీసులకు బదిలీ అయినట్టు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. ఏఎస్‌ఐ సూర్యనారాయణకు గొలుగొండకు, హెడ్ కానిస్టేబుల్ చెంగల వాసుకు ఎలమంచిలి రూరల్‌కు, కానిస్టేబుల్ నరేష్‌కు పరవాడకు, వెంకట్రావుకు మాకవరపాలెం పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యాయి. సుమారు ఏడేళ్ల నుంచి పనిచేస్తున్న ఇద్దరు మహిళ కానిస్టేబుల్ వెంకటలక్ష్మికి నర్సీపట్నం రూరల్, జగదాంబకు నర్సీపట్నం టౌన్ స్టేషన్లకు బదిలీ అయ్యాయి.

## వెంకటాపురంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో కొత్తమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేసారు. స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలైన త్రిమూర్తులు, నరసారావు మూర్తి, ముప్పిన శ్రీనివాసరావు, నీరుకొండ, శ్రీరాములు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టారు.

## ఘనంగా సత్తెమ్మతల్లి జాతర



గుర్రాజుపేటలో సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రాజుపేటలో సత్తెమ్మతల్లి జాతరను ఆదివారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి స్థానిక ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున ఆలయానికి వెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్డుల పంపిణీ

మునగపాక, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒంపోలు గ్రామంలో క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్న జనసైనికులకు ఆదివారం గుర్తింపు కార్డులను జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు ఉల్లింగల వరసత్య నగేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన బలోపేతానికి సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తోట బాలరాజు, పూర్ణచంద్రరావు, బొద్దపు హరినాథ్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎన్‌ఆర్ పేటలో వైభవంగా దుర్గాదేవి జాతర



పీఎన్‌ఆర్‌పేటలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

ఎలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనాభరాజుపేట గ్రామంలో ఆదివారం దుర్గాదేవి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పీఎన్‌ఆర్‌పేట, బయ్యవరం, ఉభయ గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళల కోలాటాలు, తప్పెటగుళ్ళు, భజనలు ఆలపిస్తూ వేలాది మంది భక్తుల సమక్షంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో గ్రామస్థులు, యువత, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన గూడుపమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అనేక ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి గర్భగుడికి డోర్స్ ఇచ్చిన ఎలమంచిలికి చెందిన త్రిపురాల రాము దంపతులను ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఘనంగా సత్కరించారు. నక్కపల్లి మాజీ సర్పంచ్ తుమ్మాకల్పన కుటుంబసభ్యులతోను, సీతంపాలెం ఎంపీటీసీ సభ్యురాలు గొర్ల దుర్గ, గోవింద్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద డీఆర్‌వో నివాళి

తుమ్మపాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లిలోని కలెక్టరేట్ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగీరథుడు దీక్షకు, సహనానికి నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డైరెక్టర్ నూకరాజు, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆలయాల్లో సామూహిక హారతి ఇవ్వండి'

పరవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లిమడుగుల నాగపేర్రాజు అన్నారు. ఇక్కడి సినిమాహాల్ జంక్షన్ వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. హిందూ సంస్కృతీ సాంప్రదాయాల గురించి నేటి యువతకు తెలియజేయాలన్నారు. రామాలయాల్లో ప్రతి రోజూ సామూహిక హారతితో పాటు భజనలు నిర్వహించాలన్నారు. ఫౌండేషన్ మండల కన్వీనర్ పెదపాటి కళ్యాణి, మండల సహా కన్వీనర్ బొద్దపు నూకరత్నం, ఎం.హైమావతి, పెదపాటి రామచంద్రరావు, సత్యనారాయణ, దేముడు, పరవాడ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కలపాక గ్రామ టీడీపీ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పరవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : కలపాక గ్రామ టీడీపీ కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. పార్టీ సీనియర్ నాయకులు ఇందల కొండలరావు, కొత్తపల్లి బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా మరిసా విష్ణు, ఉపాధ్యక్షుడుగా సప్పా కనకారావు, ప్రధాన కార్యదర్శి బొండా నరసింహారావు ఎన్నికయ్యారు. మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నాయకులు గొర్లి శ్రీనివాసరావు, ఇందల అప్పారావు, బొట్టా రమణ, గొర్లి రమణ, ఇందల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

పరవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : కార్మికవర్గ సమస్యలపై ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను అంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేలా వ్యవహరిస్తుండడం తగదన్నారు. ఈ చర్యలను దేశప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ, రాజు, అప్పలరాజు, చిట్టిబాబు, పెంటారావు, అప్పలనాయుడు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకుడికి కౌన్సెలింగ్

కశింకోట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శక్తి టీం ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడ్ని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించిన సంఘటన మండలంలోని తాళ్లపాలెంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని తేగాడ గ్రామానికి చెందిన యువకుడు తరచూ ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడని శక్తిటీంకు ఫిర్యాదు అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ మల్లీశ్వరి, కానిస్టేబుల్ దీపిక, కొండలరావు, అప్పలాచార్య, నాయుడు సదరు యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్టేషన్‌లో అతనికి కౌన్సెలింగ్ జరిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం అవుతుందని సూచించారు.

## అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

తుమ్మపాల, మే 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు జగనన్న కాలనీలో నకిలీ పట్టాతో చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని ఆదివారం వీఆర్వో అప్పారావు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్టూరులోని సర్వే నంబరు 22లో గల గ్రామ కంఠంలో నేటికి ఎనిమిది మందికి మాత్రమే అధికారికంగా ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. మిగిలి ఉన్న ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం జరిగిందన్నారు.

## నవ్వులు పూయించిన 'లాఫింగ్ క్లబ్'

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన లాఫింగ్ క్లబ్ నవ్వులు పూయించింది. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జబర్దస్త్ సత్తిపండు, ఎఫ్ఎం బాబాయ్ హాజరై తనదైన శైలిలో హాస్యాన్ని పండించారు. అనంతరం హైదరాబాద్ జబర్దస్త్ టీమ్ నవ్వుల నజరానా కార్యక్రమం ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్, డాక్టర్ వెంకట పార్వతీశం, వినకోట బుచ్చిరాజు, కొణతాల పూర్ణచంద్రరావు, విల్లూరి సంతోష్‌కుమార్, రాపేటి నారాయణరావు, ఉద్దగిరి శ్రీనివాసరావు, భీమరశెట్టి వరహా, దాడి సూరిబాబు పాల్గొన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 130.00 |
| లైవ్ ధర | 150.00 |
| విత్ స్కిన్ | 270.00 |
| స్కిన్ లెస్ | 280.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 480 |
| విజయనగరం | 484 |
| శ్రీకాకుళం | 484 |

# జాతర ముగిసినా జనమే

▸▸ భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం ▸▸ ఉదయం ఆరు గంటల నుంచే రాక ▸▸ ఏర్పాట్లను పర్యవేక్షించిన వివిధ శాఖలు



మొక్కులు చెల్లించుకుంటున్న దృశ్యం



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర గత వారంతో ముగిసినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ తెల్లవారుజాము ఆరు గంటల నుంచే భక్తుల రాక ఆరంభమైంది. ఉదయం బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. పసుపు, కుంకుమలను సమర్పించిన అనంతరం కుటుంబాలతో సహా విచ్చేసినవారు ఆలయ ఆవరణ, పరిసర తోటల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. సాయంత్రం ఐదు వరకు ఈ రద్దీ కొనసాగింది. వీరికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించగా, ఆలయ మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం ఆధ్వర్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తమయ్యారు.

## 'అనకాపల్లి'లో షూటింగ్‌లో సందడి



షూటింగ్‌లో పాల్గొన్న హీరో, హీరోయిన్

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం షూటింగ్ సందడి నెలకొంది. భవ్యశ్రీ మూవీ మేకర్స్ పతాకంపై తీస్తున్న 'అనకాపల్లి' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, మళ్లవీధి తదితర ప్రాంతాల్లో పలు సన్నివేశాలను తెరకెక్కించారు. హీరో విక్రమ్, హీరోయిన్ సంధ్యలపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను షూట్ చేశారు. ఈ చిత్రానికి దర్శకుడుగా కగేష్ వ్యవహరిస్తుండగా, స్క్రీన్‌ప్లే నిర్మాతగా నక్కిన త్రినాథరావు వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌ను తిలకించేందుకు జనం భారీగా రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

## పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

▸▸ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమర్‌నాథ్, ముత్యాలనాయుడు

సబ్బవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పెందుర్తి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇక్కడి అనకాపల్లి రోడ్డు ఇరువాడ పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపించారు. ఇకపై పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరగదని ధైర్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ ఓడినా ప్రజలంతా వైసీపీతోనే ఉన్నారన్నారు. జగన్ సీఎం అయితేనే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. తొలుత వీరు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైలపూడి జయరాం, పైల శ్రీనివాసరావు, గండి రవికుమార్, కొటాన రాము, కర్రి బాబు, పాలిశెట్టి సురేష్‌రాజ్, బోకం రాము నాయుడు, సబ్బవరపు ముత్యాలనాయుడు, చొప్పా నాగరాజు, శరగడం చిన అప్పలనాయుడులతో పాటు మూడు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోదండ సీతారామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే బండారు తదితరుల పూజలు

సబ్బవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : టిక్కలిపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ సీతారామస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా గణపతి, వీరవెంకట సత్యనారాయణస్వామి, కోదండ సీతారామస్వామి వార్ల విగ్రహాలను, ఆలయ శిఖరంపై పసిడి కలశాన్ని ప్రతిష్ఠించారు. తొలుత వేదపండితులు స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వీకేపీసీపీఐఆర్ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, వైసీపీ నాయకుడు గండి రవికుమార్, బోకం రామునాయుడు, చొక్కాకుల గోవింద, కూటమి నాయకులు గండి వంశీదీప్, ఇందలి రమణ, బలిరెడ్డి అప్పారావు, కొటాన అప్పారావు, శరగడం శంకరరావు తదితరులు దర్శించుకున్నారు. సర్పంచ్ గొంప సత్యవమ్మ, గ్రామ పెద్దలు గొంప నాయనప్ప, పైల వెంకటరమణ, పంచాడ శ్రీను, కొటాన వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బ్రహ్మసూత్ర శివాలయాన్ని దర్శించుకున్న జెడ్సీ రమణ



ఆలయంలో జోనల్ కమిషనర్ తదితరుల పూజలు

కశింకోట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో పురాతనమైన బ్రహ్మసూత్ర శివాలయాన్ని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనకు కండువా వేసి సత్కరించారు.

## ప్రసన్నాంజనేయ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

సబ్బవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : నారపాడులో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారికి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, వైసీపీ నాయకుడు గండి రవికుమార్, రామకృష్ణరాజు, రాపేటి రాముతో పాటు గ్రామ పెద్దలు కొరుపోలు గోవింద, రొంగలి శ్రీను, దుర్గఅప్పారావు, తాసుబిల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## 95 మందికి కంటి వైద్య పరీక్షలు

సబ్బవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : బంగారమ్మపాలెం ఆదివారం ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమృత ఆసుపత్రి, వాసన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరానికి వివిధ గ్రామాల నుంచి 95 మంది విచ్చేసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. పలువురికి మందులు అందజేసి, కొందరికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందితో పాటు సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాపేటి రాము తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో ఉత్తములకు సత్కారం



తల్లులు, విద్యార్థినులను సత్కరించిన సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లాడ్జి రామలింగ, మెసానిక్ లాడ్జి యాజమాన్య ప్రతిని ధులు ఆదివారం తమ సంస్థలో మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తర గతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను, వారి తల్లులను ఘనంగా సత్కరించారు. అలాగే, ప్రతి విద్యార్థికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ బాబ్జి, రామ చంద్రరావు, డాక్టర్ వీకే గుప్తా, అనిల్ చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల కలయిక



సబ్బవరం హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



అనకాపల్లి మండలం సీతానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

సబ్బవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తరువాత అంతా ఓ చోట చేరడంతో కోలాహల వాతావరణం నెలకొంది. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్య క్రమంలో పల్ల తాతారావు, మండల లక్ష్మణ, రేసుపూడి రమణ, గొర్లి శ్రీనివా సరావు, కొత్తూరు శ్రీనివాసరావు, అక్కుబాబు, దనిమిరెడ్డి రఘు తదితరులు పాల్గొన్నారు.

### సీతానగరం జడ్పీ హైస్కూల్‌లో...

కొత్తూరు : అనకాపల్లి మండలం సీతానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2007లో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆనందాలకు అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. భోజనాల అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

## 'పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలా..'

కొత్తూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించకుండా పార్టీ కార్యాలయాలకు స్థలాలు ఇవ్వడాన్ని సీపీఎం మండల కమిటీ ఖండించింది. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సభ్యులు కాళ్ల తేలయ్యబాబు, కనకళ్ల అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడారు. తుమ్మపాల రెవెన్యూ సర్వే నంబరు 608-10లో రు.20 కోట్లు విలువ స్థలాన్ని ఏడాదికి రూ.2వేలకు 36 సంవత్సరాల పాటు టీడీపీ కార్యాలయానికి లీజుకు ఇవ్వడాన్ని తప్పుబట్టారు.

## సాయిబృందావన్ నగర్‌లో స్వచ్ఛభారత్



పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెంలోని సాయిబృందావన్ నగర్‌లో పెరిగిన ప్రమాదకరమైన వయ్యారిభామ మొక్కల తొలగింపు ఆదివారం చేపట్టారు. భారత వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రాంతీయ పర్యావరణ పరిరక్షణ కార్యదర్శి డాక్టర్ ఎస్.నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ముఖ్య అతిథిగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం పరిషత్ ప్రతినిధులు, స్థానికులతో కలిసి వయ్యారిభామ మొక్కలను తొలగించి, స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదకరమైన ఈ మొక్కలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నూకరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగరవాసులు పాల్గొన్నారు.

## కొమ్మ పడిందో.. కొంప మునిగిందే...!

▸▸ ఎండిన చెట్లతో భయం..భయం..



రహదారికి ఆనుకొని కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిన చెట్ల కొమ్మలు

పరవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటగెడ్డ జంక్షన్ నుంచి సింహాద్రి ఎన్టీపీసీ మీదుగా వాడచీపురుపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో ఎండిపోయిన చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఎన్టీపీసీ కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నునపర్తి పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ చెట్లు ఎండిపోయి ఉండడంతో అప్పుడప్పుడు కొమ్మలు విరిగి పడుతున్నాయి. ఇదిచూసిన వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అదే తమపై పడితే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరగరానిది జరగకముందే తొలగించాలని అంతా కోరుతున్నారు.

## 20న లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మె

▸▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు




సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా సదస్సులో మాట్లాడారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వలన సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. పారిశ్రామిక వివాదాలు, చట్టానికి తూట్లు పొడవడం వంటి అనేక దుర్మార్గమైన విధానాలను ఈ లేబర్ కోడ్స్‌లో పొందుపరిచారని ఆరోపించారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించకుండా తిప్పికొట్టాలన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు, కూలీల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. గతంలో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో సమ్మెను విజయవంతం చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, దుర్గారాణి, గూనూరు వరలక్ష్మి, వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయబద్ధంగా మాడుగులమ్మ ఉత్సవాలు



అమ్మవారి ఘటాలను మోసుకు వెళుతున్న మాజీ మంత్రులు బాలరాజు, మణికుమారి తదితరులు

జి.మాడుగుల, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మత్స్యమాడుగులమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 6 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమ్మవారి జాతరలో మొదటి రోజు మత్స్యరాస వంశీయులతో పాటు భక్తులు డప్పు వాయిద్యాలు, ఘటాలతో పూర్వీకులు వినియోగించిన సాంప్రదాయ ఆయుధాలైన నాటుతుపాకీ, ఖడ్గంతో ఊరేగింపుగా వెళ్లి సతకంపట్టు వద్ద ప్రతిష్ఠించారు. జాతర చివర రోజు వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామరాజు, జి.రెడ్డిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు, ఎం.లక్ష్మీపతిరాజు, సొలభం సర్పంచ్ ఐ.హనుమంతరావు, అర్జున్‌రావు, భక్తులు పాల్గొన్నారు. జాతరకు వరుణ గండం: మండలంలో రెండు రోజులుగా రాత్రి వేళల్లో భారీగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తాజాగా ఆదివారం రోజంతా ముసురు వాతావరణం నెలకొంది.

### మినుములూరులో మోదకొండమ్మ పండుగ ప్రారంభం

పాడేరురూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు గ్రామంలో మోదకొండమ్మ పండుగను ఆదివారం ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు ప్రారంభించారు. మూడు రోజులు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు ఘటాలను సమర్పించారు. మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించాక ఆఖరి రోజు మంగళవారం అనుపోత్సవంతో పండుగ ముగుస్తుంది.



జి..మాడుగులలో విద్యుత్ కాంతుల పందిరి

# పెదపాడులో దాహం కేకలు

- మరుగునపడిన గ్రావిటీ పథకం
- కిలోమీటరు దూరంలో ఊటగెడ్డను ఆశ్రయిస్తున్న గిరిజనులు



తాగునీటి కోసం కొళాయి దగ్గర బిందెలతో వేచి ఉన్న ఆదివాసీ మహిళలు

గూడెంకొత్తవీధి, మే 4 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి పంచాయతీ పెదపాడు గ్రామంలో ఆదివాసీలు తాగు నీటి కోసం అల్లాడిపోతున్నారు. ఆరేళ్ల క్రితం గ్రామంలో నిర్మించిన రక్షిత మంచి నీటి పథకం మరుగునపడిపోయింది. దీంతో నీళ్ల కోసం గ్రామ శివారులో ఉన్న ఊటగెడ్డను ఆశ్రయిస్తున్నారు. ఊటనీరు సురక్షితం కాకపోవడంతో ఆదివాసీలు తరచూ వ్యాధులబారిన పడుతున్నారు. పెదపాడు గ్రామంలో 63 కుటుంబాల ఆదిమజాతి ఆదివాసీలు (పీవీటీజీ) నివాసముంటున్నారు. ఆదివాసీలు తాగునీటికి అవస్థలు పడుతుండడంతో గత టీడీపీ ప్రభుత్వం 2018లో గ్రావిటీ పథకం నిర్మించింది. కొండవాగు నుంచి పైపుల ద్వారా మంచినీటి ట్యాంక్ నింపి పబ్లిక్ కొళాయిల ద్వారా గిరిజనులకు నీటిని సరఫరా చేశారు. ఆరేళ్లపాటు ఈ పథకం గిరిజనులకు ఉపయోగపడింది. తాజాగా ఈ పథకానికి నీటిని అందించే కొండవాగు జలాలు అంతరించిపోయాయి. దీంతో గ్రావిటీ పథకం ద్వారా నీటి సరఫరా జరగడంలేదు. ప్రస్తుతం ఆదివాసీలు గ్రామ శివారున వాగు సమీపంలో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. ఊటనీళ్లు సురక్షితం కాకపోవడంతో గిరిజనులు జ్వరాలు, జలుబు, దగ్గు, అతిసార వ్యాధులకు గురవుతున్నారు. మహిళలు ఊటగెడ్డ నుంచి నీళ్లు తెచ్చుకోవడానికి పొలాల గట్లపై నుంచి రానుపోను రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రావిటీ పథకానికి నీటిని అందించే కొండవాగు అంతరించిపోయినప్పటికీ మరో రెండు వందల మీటర్ల దూరంలో ఇంకో కొండవాగు ద్వారా పుష్కలంగా నీటి ప్రవాహం జరుగుతున్నది. ఈ కొండవాగు నుంచి నీటిని గ్రావిటీ పథకానికి మళ్లించగలిగితే యథావిధిగా గ్రావిటీ పథకం మళ్లీ వినియోగంలోకి వస్తుంది. గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యపై పలు మార్లు మండల పరిషత్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి గ్రావిటీ పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అదనపు పైపులు ఏర్పాటు చేయాలని ఆదివాసీ మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న గ్రావిటీ పథకం కొళాయి

## ఏహెచ్‌లో తీరనున్న వైద్యుల కొరత

- ముగ్గురు వైద్యుల నియామకం

చింతపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): నూతన నియామకాలతో ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత తీరనున్నదని స్థానిక సూపరింటెండెంట్ పి.ఇందిరా ప్రియాంక తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో ఖాళీల భర్తీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ముగ్గురు వైద్యనిపుణులు బాధ్యతలు స్వీకరించారన్నారు. నేత్ర వైద్యులు (ఆప్తమాలజిస్టు)గా డాక్టర్ డి.అనూష, వ్యాధుల నిర్ధారణ నిపుణులు (పేథాలజిస్టు)గా వి.రమేశ్, స్త్రీవైద్య నిపుణులు (గైనికాలజిస్టు)గా ఎస్.వాసవి నియమితులయ్యారన్నారు. ముగ్గురు వైద్యులు విధుల్లో ఉన్నారన్నారు. అలాగే మత్తువైద్యుని (ఎనస్థీషియా) కూడా నియమించారని, ఆయన విధుల్లో చేరేందుకు రిపోర్టు చేయలేదన్నారు. ఖాళీగాఉన్న ఇతర ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నేత్ర వైద్యులు, స్త్రీ వైద్యనిపుణులు, వ్యాధుల నిర్ధారణ వైద్యులు అందుబాటులో ఉండడంతో రోగులు ప్రత్యేక వైద్యనిపుణుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక

### పాడేరులో 36.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండల ప్రభావం తగ్గడం లేదు. దీంతో ఏజెన్సీ వాసులు వేడికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెల్లవారుజామున కాస్తా చల్లదనంగా ఉంటున్నప్పటికీ, మిలిగిన సమయంలో వేడి ఆపసోపాలు కలిగిస్తోంది. ముఖ్యంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీలో ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో 36.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, కొయ్యూరులో 35.3, పెదబయలులో 34.3, డుంబ్రిగుడలో 33.7, అరకులోయలో 32.3, హుకుంపేటలో 32.1, ముంచంగిపుట్టులో 31.4, చింతపల్లిలో 30, అనంతగిరిలో 29.6, జి.మాడుగులలో 29.4, జీకేవీధిలో 28.4, డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### జూన్ నెలాఖరు వరకు ఈకేవైసీ గడువు పొడిగింపు

చింతపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు జూన్ నెలాఖరు వరకు గడువు పెంచినట్లు స్థానిక తహసీల్దార్ బి.రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలుత ఏప్రిల్ 30 వరకు గడువు ఇవ్వగా, ఈకేవైసీ పూర్తి స్థాయిలో పూర్తికాకపోవడంతో తాజాగా పొడిగించినట్లు పేర్కొన్నారు. చింతపల్లి మండలంలో 80శాతం ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. ఇంతవరకు ఈకేవైసీ చేయించుకోనివారు ఎండీయూ ఆపరేటర్, డీలర్ల వద్దకు వెళ్లి పని పూర్తిచేయించుకోవాలన్నారు.

## 20న లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మె

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా సదస్సులో మాట్లాడారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వలన సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. పారిశ్రామిక వివాదాలు, చట్టానికి తూట్లు పొడవడం వంటి అనేక దుర్మార్గమైన విధానాలను ఈ లేబర్ కోడ్స్‌లో పొందుపరిచారని ఆరోపించారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించకుండా తిప్పికొట్టాలన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు, కూలీల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. గతంలో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, దుర్గారాణి, గూనూరు వరలక్ష్మి, వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి




అవగాహన ర్యాలీలో పాల్గొన్న జేజేఎస్ సంఘ్ ప్రతినిధులు

జి.మాడుగుల, మే 4 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై కనీస అవగాహన ఉండాలని జన్ జీవన్ సంఘ్ లీగల్ అధ్యక్షుడు కె.అప్పాజీ తెలిపారు. మండలంలోని వంతాల పంచాయతీ చింతగొంది పినలోచలి గ్రామాల గిరిజనులకు శని,ఆదివారాలు మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సులు, బీమా ప్రతి వాహనదారుడు పొంది ఉండాలని సూచించారు. అలాగే పోక్సో తదితర చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ ప్రతినిధులు మహేశ్‌బాబు, జి.సురేశ్, కుంబిడిసింగి సర్పంచ్ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

## చెరుకుమడత-బల్లుగుడ తారురోడ్డు ఎప్పటికి పూర్తయ్యేనో!

- అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు
- రాళ్లుతేలిన మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

అనంతగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబిడ్డ పంచాయతీ నిమ్మలపాడు నుంచి చెరుకుమడత, కంటిపురం మీదుగా బల్లుగుడ వరకు రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-23లో జాతీయ ఉపాధి పథకం కింద రూ.1.95 కోట్లతో తారురోడ్డు పనులు మంజూరయ్యాయి. అయితే ఆరంభంలో పనులు శరవేగంగా జరిగినప్పటికీ, ఆ తరువాత వివిధ కారణాలతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో పెదబిడ్డ, గుమ్మ పంచాయతీలకు చెందిన సుమారు 25 గ్రామాల గిరిజనులు నానాపాట్లు పడుతున్నారు.

కాగా నిమ్మలపాడు రోడ్డు నుంచి చెరుకుమడత మీదుగా పెదబిడ్డ పంచాయతీ కేంద్రానికి సుమారు 15 ఏళ్ల క్రితం తారురోడ్డు నిర్మించారు. ఐదేళ్ల వరకు రోడ్డు బాగానే ఉన్నా.. ఆ తరువాత అధ్వానంగా మారింది.. దీంతో చెరుకుమడత నుంచి పెదబిడ్డ వెళ్లేందుకు గిరిజనులు నరకయాతనకు గురయ్యేవారు. అయితే గత ప్రభుత్వంలో బల్లుగుడ నుంచి పెదబిడ్డ మీదుగా గుమ్మ పంచాయతీ కేంద్రం వరకు తారురోడ్డు నిర్మించారు. నిమ్మలపాడు రోడ్డు నుంచి చెరుకుమడత, కంటిపురం మీదుగా బల్లుగుడ వరకు రూ.1.95 కోట్లతో పనులు ప్రారంభించి, రోడ్డంతా చదువును చేసి, వర్షపు నీరు పారేందుకు వీలుగా ఇరువైపులా కాలువలను తీశారు. ఆ తరువాత మెటల్ వేసి వదిలేశారు. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తవుతుందన్న గిరిజనుల ఆశలు అడియాశలయ్యాయి. ఈ పనులు నిలిచిపోయి ఏడాదిన్నర కావస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని గిరిజనులు వాపోతున్నారు. చెరుకుమడత నుంచి కంటిపురం మీదుగా బల్లుగుడ వరకు మెటల్ రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ గిరిజనులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తారురోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, పెదబిడ్డ, గుమ్మ పంచాయతీకి చెందిన పలువురు గిరిజనులు కోరుతున్నారు.



బల్లుగుడ-కంటిపురం వరకు మెటల్ వేసి వదిలేసిన రోడ్డు



కంటిపురం నుంచి చెరుకుమడత వరకు రాళ్లుతేలి ఉన్న దృశ్యం

## డ్రైనేజీ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

డ్రైనేజీ సమస్య తొలగుతుందని ప్రజలు భావించారు. అయితే స్థలాలు, భవనాలు కోల్పోతున్న వారిలో కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి. దీంతో కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది డ్రైనేజీ పరిస్థితి. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుము వరకు 3,000 వేల మీటర్ల మేర డ్రైనేజీ కాలువలు నిర్మించాల్సి వుండగా, కేవలం 250 మీటర్లు మాత్రమే పూర్తి నిర్మించారు. అసంపూర్తి పనుల కారణంగా కాలువల్లో మురుగు నీరు పారడం లేదు. రోడ్డుకు ఇరువైపులా వున్న వ్యాపారులు, నివాసితులు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. చింతపల్లి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు, నర్సీపట్నం-కృష్ణాదేవి పేట రోడ్డులో కాలువలు పూర్తిగా పూడుకు పోయాయి.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సైడ్ వాల్స్ లేని డ్రైనేజీ కాలువ

### వార్డుల్లో పరిస్థితి మరీ అధ్వానం..

మునిసిపాలిటిలోని ఇతర ప్రాంతాల్లో సైతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు.. వీధి కాలువల్లో నుంచి మురుగు నీరు మెయిన్ డ్రైనేజీలోకి పంపే మార్గం లేదు. సీసీ రోడ్లు నిర్మిస్తున్న అధికారులు.. డ్రైనేజీ కాలువల గురించి పట్టించుకోవడం లేదు. లోతట్టు ప్రాంతాలైన వెంకునాయుడుపేట, బొంతువీధిలో డ్రైనేజీ నీరు పోయే మార్గం లేక చిన్నపాటి వర్షానికి మురుగునీరు రోడ్లపై పారుతున్నది. ప్రశాంతి నగర్, బ్యాంక్ కాలనీ, శారదా నగర్, బొంతువీధి, శివపురం తదితర ప్రాంతాల్లో కాలువలు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



## అడపవలసలో లారీ బోల్తా

### డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు

డుంబ్రిగుడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడపవలసలోని ఆంధ్ర-ఒడిశా ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున చేపల లోడుతో వెళ్తున్న ఓ లారీ బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆంధ్ర నుంచి ఒడిశాలోని జైపూర్ వెళ్తున్న ఈ లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో ఉదయం ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. స్థానికుల సాయంతో ట్రాక్టర్‌తో లారీని పక్కకు జరిపారు. అనంతరం ఇతర వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

## ఉత్సాహంగా ఆటల పోటీలు



కప్పగెంతుల ఆటలో నిమగ్నమైన చిన్నారులు

డుంబ్రిగుడ, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి సునీత ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. కప్పగెంతుల ఆటతో చిన్నారులు కేరింతలు కొట్టారు. విజ్ఞాన శిబిరంలో చిన్నారులు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు.

## ఘనంగా మోదకొండమ్మ పందిరిరాట ఉత్సవం

- ఆలయం వద్ద నుంచి సతకంపట్టు వరకు ఊరేగింపు

పెదబయలు, మే 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీమోదకొండమ్మ ఉత్సవాలను మే 18, 19, 20 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సతకంపట్టు వద్ద ఆదివారం పందిరిరాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిమంకరి బొంజుబాబు, సర్పంచ్ పలాసి మాధవరావు, గ్రామ పెద్ద గంపరాయి సూరయ్య సమక్షంలో మోదకొండమ్మ ఆలయం వద్ద పందిరిరాటకు ప్రత్యేక పూజలు చేసి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టి సతకంపట్టు వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా బొంజుబాబు మాట్లాడుతూ వచ్చే నెలలో మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అందరూ సహకరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు చక్రధర్, శశి, సింహచలం, నీలయ్య, చిట్టిబాబు, కొండయ్య, లక్ష్మణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు



హుకుంపేటలో అమ్మవారి పాదాలను ఊరేగిస్తున్న దృశ్యం

### హుకుంపేటలో మోదకొండమ్మ పండగ ప్రారంభం

హుకుంపేట: మండల కేంద్రమైన హుకుంపేటలో మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యే క పూజలు చేశారు. అమ్మవారి పాదాలను గిరిజన సంప్రదాయాలతో బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించారు. అమ్మవారి పాదాలను మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. స్థానిక సతకంపట్టు వద్ద కూడా అమ్మవారి పాదాలకు, గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనిల్, కాసులమ్మ, పూర్ణిమ, సాగిరి, రాజారావు, ప్రవీణ్, నూకన్న, సురేశ్, శివ, మోహన్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై ఒరిగిన భారీ వృక్షం

ముంచంగిపుట్టు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో గల లుంగాపుట్టు సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై భారీ వృక్షం ఒరిగిపోయింది. ఏ క్షణంలో ఈ చెట్టు నేలకూలే ప్రమాదం ఉందని ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొంతకాలం కిందట కొద్దిగా ఒరిగిన ఈ వృక్షం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కూలిపోయే స్థితికి చేరింది. చెట్టు కూలి ఎవరికి ఏ ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి ఈ వృక్షాన్ని తొలగించవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.



ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు

## స్పీకర్ అయ్యన్నను కలిసిన డీసీసీబీ చైర్మన్ 'కోన'



అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ తాతారావు

నర్సీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావు ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుని మర్యాద పూర్వంగా కలి శారు. ఇక్కడి క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన తాతారావు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం రైతాంగానికి, బ్యాంక్ అభివృద్ధికి దోహద పడుతుందన్నారు కూటమి ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వ్యవహరించి వ్యవసాయ రం గాన్ని పోత్సహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మార్షల్ ఆర్ట్సలో ఉచిత శిక్షణ



పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వెలగా నారాయణరావు

నర్సీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదానగర్ రెండో లైన్‌లో ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రతిరోజూ ఉదయం ఏడున్నర గంటల నుంచి తొమ్మిది గంటల వరకు జూడోలో శిక్షణ ఇస్తారు. ఈ నెలాఖరు వరకు శిబిరం కొనసాగుతుందని, శిక్షణకు వచ్చే పిల్లలకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తామని చైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ తోట ప్రసాద్, ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకుడికి కౌన్సెలింగ్

కశింకోట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శక్తి టీం ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడ్ని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించిన సంఘటన మండలంలోని తాళ్లపాలెంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని తేగాడ గ్రామానికి చెందిన యువకుడు తరచూ ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడని శక్తిటీంకు ఫిర్యాదు అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ మల్లీశ్వరి, కానిస్టేబుల్ దీపిక, కొండలరావు, అప్పలాచార్య, నాయుడు సదరు యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్టేషన్‌లో అతనికి కౌన్సెలింగ్ జరిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం అవుతుందని సూచించారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 130.00 |
| లైవ్ ధర | 150.00 |
| విత్ స్కిన్ | 270.00 |
| స్కిన్ లెస్ | 280.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 480 |
| విజయనగరం | 484 |
| శ్రీకాకుళం | 484 |

# తిరగని ఫ్యాన్లు.. విరిగిన కుర్చీలు

▸▸ నర్సీపట్నం ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సమస్యల కొలువు ▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ అవస్థలు పడుతున్న ప్రయాణికులు



ఫ్యాన్లు లేకు వేళాడుతున్న ఇనుప రాడ్లు



దూర ప్రాంతాలకు బస్సుల కోసం బస్ స్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నర్సీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. విరిగిన కుర్చీలు, తిరగని ఫ్యాన్లు చూసి అవాక్కవుతున్నారు. కుర్చోవడానికి ఏర్పాటు చేసిన ఇనుప కుర్చీ విరిగి పోయింది. చాలా కాలంగా ఇది ఇలాగే ఉన్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ బస్ స్టాండ్‌లో ప్రయాణికులు అటు, ఇటు తిరిగే ప్రదేశంలో విరిగిన కుర్చీ ఉంది. అక్కడే చిన్నపిల్లలు కూర్చొని అప్పుడప్పుడు ఆడుతుంటారు. అటువంటి సమయంలో జరగరానిది ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ బస్ స్టాండ్‌లో 15 ఫ్యాన్లు ఉండేవి. వాటిలో ఐదు ఫ్యాన్లు లేవు, వాటికి సంబంధించిన రాడ్లు హుక్కులకు వేలాడుతూ కనిపిస్తున్నాయి. మిగి లిన పది ఫ్యాన్లలో నాలుగు తిరిగడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో మండుతున్న ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రగతి జూనియర్ కళాశాల, ఎంఎల్ ఏఎస్ డిగ్రీ కళాశాల యాజమన్యాలు ఏడాది క్రితం మొక్కలతో కుండీలు ఏర్పాటు చేశారు. సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా కుండీలలో మొక్కలు లేవు. ప్రస్తుతం సదరు కుండీలు ఉమ్మి తొట్టెలు, డస్ట్ బిన్‌లుగా మారిపోయాయి. మొక్కలకు ప్రతిరోజూ నీరు పోస్తే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని అభిప్రాయపడుతున్నారు. సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరుతున్నారు.

## టీడీపీ రాచపల్లి గ్రామ కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

మాకవరపాలెం, మే4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచపల్లిలో ఆదివారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా రుత్తల జమీందార్, ఉపాధ్యక్షుడిగా రొంగలి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా అడిగర్ల నూకరాజు, కార్యదర్శిగా శ్రీను ఎన్నికైనట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు, రాచపల్లి ఎంపీ టీసీ సభ్యుడు ఆర్.వై.పాత్రుడు తెలిపారు. మరింకొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు గ్రామంలో పార్టీని పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి టీడీపీ సీనియర్ నాయకులు రుత్తల జోగిపాత్రుడు, మండల యూత్ ఉపాధ్యక్షుడు శంకర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## రెండు మండలాల్లో వర్షం



నర్సీపట్నంలో చిరుజల్లులు కురుస్తున్న దృశ్యం



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో కుండపోత వర్షం

నర్సీపట్నం/కృష్ణాదేవిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా నర్సీపట్నం, గొలుగొండ తదితర మండలాల్లో ఆదివారం పలుమార్లు వర్షం కురిసింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. గత రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో అంతవరకు ఉన్న తీవ్ర ఎండల నుంచి జనం ఉపశమనం పొందుతున్నారు. నర్సీపట్నంలో ఉదయం నుంచి వర్షం పడుతుండడం, విడిచిపెడుతుండడంతో రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి. జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిరు వ్యాపారులకు వ్యాపారాలు సరిగా సాగక డీలా పడ్డారు. ముఖ్యంగా గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు రహదారుల మరమ్మతుకు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## ఏడు నుంచి మరిడి మహాలక్ష్మి జాతర



నర్సీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : బలిఘట్టంలోని మరిడి మహాలక్ష్మి జాతరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆల యాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల ఏడో తేదీన పెద్ద జాగరణ జరగనుంది. ఈ సందర్భంగా నేల డ్యాన్సులు, ధింసానృత్యం, మరిడిమాంబ ఆలయం వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి స్టేజీ కార్యక్రమాలు ఉంటాయి. మర్నాడు ఎనిమిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు షణ్ముఖ నగర్‌లో ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు తీన్‌మార్ డప్పు కళాకారుల వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. బీసీ కాలనీ వినాయకుడి గుడి వద్ద మాస్ జాతర, బలిఘట్టం దుర్గమ్మ ఆలయం వద్ద డ్యాన్స్ హంగామా ఏర్పాటు చేశారు.

## 150 మందికి కంటి వైద్య పరీక్షలు




కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మాకవరపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి 150మంది విచ్చేసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 42 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో నిర్వాహకులు పి.గౌరి, శివమనోహర్‌నాయుడు, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అశ్వినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'అనకాపల్లి' లో షూటింగ్‌లో సందడి



షూటింగ్‌లో పాల్గొన్న హీరో, హీరోయిన్

అనకాపల్లి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం షూటింగ్ సందడి నెలకొంది. భవ్యశ్రీ మూవీ మేకర్స్ పతాకంపై తీస్తున్న 'అనకాపల్లి' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, మళ్లవీధి తదితర ప్రాంతాల్లో పలు సన్నివేశాలను తెరకెక్కించారు. హీరో విక్రమ్, హీరోయిన్ సంధ్యలపై కొన్ని సన్నివేశాలను షూట్ చేశారు. దర్శకుడుగా కగేష్, స్క్రీన్‌ప్లే నిర్మాతగా నక్కిన త్రినాథరావు వ్యవహరిస్తున్నారు.

## మోదకొండమ్మకు శతమానం వితరణ



అమ్మవారికి వితరణగా బంగారు శతమానం అందిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘాట్ రోడ్డు జంక్షన్‌లో కొలువైన మోదకొండమ్మ అమ్మవారికి బంగారు శతమానం ఆదివారం భక్తులు వితరణగా అందించారు. మాడుగులకు చెందిన హల్వా వ్యాపారి దాసరి భీమరాజు దంపతులు అమ్మవారికిఅర తులం బంగారు శతమానం తయారు చేయించి కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కోట్ని సత్తిబాబు, శ్రీను, బలరాం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'పిల్లలకు మంచి అలవాట్లు నేర్పాలి'



వాలాబులో విద్యార్థులకు బోధన చేస్తున్న ఎన్.రవిశంకర్

దేవరాపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, సత్ప్రవర్తన నేర్పించాలని సత్యసాయి సేవా సంస్థల బాలవికాస్ ఇన్‌చార్జి ఎన్.రవిశంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని వాలాబులో నిర్వహించిన బాల వికాస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి మంచి లక్షణాలను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జోన్ ఇన్‌చార్జి రవిశంకర్, నూకరాజు, సన్యాసిరావు, జనార్దన్, వరలక్ష్మి, బాల వికాస్ చిన్నారులు పాల్గొన్నారు.

## వైసీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి

దేవరాపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా సాయి సమావేశం ఈనెల 5న అనకాపల్లిలో జరుగుతుందని, దానిని విజయవంతం చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

## మాడుగులలో వర్షం

మాడుగుల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వర్షం పడింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు జల్లుల వర్షం పడి తెరిపిచ్చింది. సాయంత్రం వర్షం పడలేదు. చల్లని వాతావరణంతో ప్రజలు ఉపశమనం పొందారు.

# చినుకు పడితే బీఎన్ రోడ్డు చెరువే

▸▸ గోతుల్లో చేరుతున్న వర్షపు నీరు ▸▸ రాకపోకలకు వాహనచోదకుల తిప్పలు ▸▸ ప్రమాదాల బారిన వాహన చోదకులు



వడ్డాది వద్ద వర్షపు నీటితో నిండిన గోతులు



తాచేరు డైవర్షన్ రోడ్డులో వాహనదారుల ఇక్కట్లు

బుచ్చెయ్యపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డు వాహన చోదకులకు నరకప్రాయంగా మారింది. రావికమతం నుంచి చోడవరం వరకు అడుగుకో గొయ్యి ఏర్పడింది. ఏ మాత్రం వర్షం కురిసినా గోతులలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పొట్టిదొరపాలెం, ఎల్.సింగవరం, బంగారుమెట్ట, వడ్డాదిల వద్ద రోడ్డు దారుణంగా ఉంది. వర్షం కురిసినప్పుడు నీరు చేరడంతో వాహనచోదకులు గోతులు అని తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. బీఎస్ రోడ్డులో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. కూలిపోయిన వడ్డాది, విజయరామరాజుపేట వంతెనల వద్ద డైవర్షన్, రోడ్లల్లో చినుకు పడితే వాహన చోదకులు ప్రత్యక్ష నరకం కనిపిస్తుందని వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బీఎన్ రోడ్డు అధ్వాన స్థితికి చేరిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. కనీసం మరమ్మతులకు నోచుకోలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు బీఎన్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# పంటలను నాశనం చేస్తున్న కోతులు

▸▸ మేడివాడ రైతులు మొర

▸▸ మామిడి, జీడిమామిడి, బొబ్బర పంటలకు నష్టం



మామిడి తోటల్లో సంచరిస్తున్న కోతులు

రావికమతం, మే 4 (ఆంధ్రజ్యోతి): చేతికి అందొచ్చిన పంటలను కోతుల గంపు నాశనం చేస్తున్నాయని మేడివాడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా మామిడి, జీడిమామిడి, అపరాలు(బొబ్బర)తదితర పంటలను కోతుల మూక కొరికి నాశనం చేస్తున్నాయని వారు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఫలసాయం చేతికి అంది వచ్చే తరుణంలో కోతుల గుంపు నాశనం చేస్తున్నాయని రైతులు విడుదల గోవింద, మహాలక్ష్మినాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. పంటల్లోగాని, మామిడి తోటల్లోగాని కోతుల గుంపు ఉన్న సమయంలో ఒంటరిగా వెళితే దాడులకు తెగబడుతున్నాయన్నారు. తమ గోడును అటవీ శాఖ అధికారులకు తెలియజేశామని, వారు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఈ కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం

రావికమతం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలు, బీమాపై ఇంటింటికి వెళ్లి టీడీపీ కార్యకర్త పులగాయల గోవింద ప్రచారం చేస్తున్నారు. తన మిత్రులతో కలిసి మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సీనియర్ సిటిజన్ కార్డ్, పీఎం కిసాన్ కార్డ్, ఈశ్రమ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కల్పిస్తూ, అక్కడికక్కడే గ్రామస్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అలాగే సొంత ఇల్లు లేనివారి వివరాలు సేకరిస్తున్నారు. రేషన్ కార్డులు లేని వారి వివరాలు నమోదు చేసి నివేదిక తయారు చేస్తున్నట్టు టీడీపీ కార్యకర్త గోవింద తెలిపారు. పేదల సమస్యలను ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

## అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

బుచ్చెయ్యపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో ఉన్న 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 2014-19 సంవత్సరాల మధ్య మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు చేయగా.. అవన్నీ సగంలో పనులు నిలిచిపోయాయి. 2019 నుంచి 2024 మధ్యలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు చేయగా.. వాటి పనులు కూడా సగంలో ఆగిపోయాయి. గ్రామంలో ఐదు కేంద్రాల భవనాలు నిలిచిపోగా.. రెండు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు స్థల సమస్య వేధిస్తోంది. దీంతో ఇరుకు గదుల్లో చిన్నారులు ఉండాల్సి వచ్చింది. చిన్నారుల ఆట సామగ్రి వినియోగించడానికి అవకాశం లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉండిపోయాయి. ఈ విషయమై టీడీపీ గ్రామ అధ్యక్షుడు దొండా నరేష్, సయ్యపురెడ్డి శ్రీనివాస్ , తలారిశంకర్, సింగంపల్లి రమేష్, గురుమూర్తి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

## టెన్త్ టాపర్ ఉదయ్‌కుమార్‌కు సత్కారం



ఉదయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ పడాల్‌దాస్, సంఘ సభ్యులు

దేవరాపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 590/600 మార్కులు సాధించిన తిమిరాంకు చెందిన గుంపాన ఉదయ్‌కుమార్‌ను ఎంఈవో పడాల్ దాసు, ఆప్తమిత్ర సంఘం సభ్యులు శనివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయకుమార్‌కు రూ.5,016 నగదును ప్రోత్సాహకంగా అందించారు. విద్యలో బాగా చదువుకుంటున్న వారికి తమ సంఘం ప్రోత్సహిస్తుందని సంఘం సభ్యులు పేర్కొన్నారు.

## 'రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'



రైతు కుటుంబానికి రూ.ఐదు వేలు అందజేస్తున్న వైసీపీ నాయకులు

చీడికాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు పాడిగేదె, పెయ్యిని కోల్పోయిన పేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, కొల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని చినగోగాడ గ్రామానికి చెందిన కోసేటి సత్యారావుకు చెందిన పాడి గేదె, ఒక పెయ్యిపై శనివారం మధ్యాహ్నం పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ విషయం తెలుసుకున్న వారు రూ.5వేలు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో పుట్టా రామ్‌కుమార్, కురచా నారాయణమూర్తి, కొండబాబు, కొల్లి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోనాం బొగొండమ్మ పండుగ



కోనాంలో నేల డ్యాన్సులు చేస్తున్న కళాకారులు

చీడికాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం గ్రామంలో ఆదివారం బొగొండమ్మ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకు దింసా కళాకారుల నృత్యం అలరించింది. నేల డ్యాన్సులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు.